క్లుప్తంగా

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

కమిషనర్ రమేష్‌బాబు



పొన్నూరు: పరిసరాల పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ తప్పక పాటించాలని మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు అన్నారు. ఆదివారం పట్టణంలోని 2,23,11 వార్డులలో ఆయన పర్యటించి జరుగుతున్న పారిశుద్ధ్య పనులు పరిశీలించారు. 31 వార్డులలో ఎక్కడ చెత్త నిల్వ చేరకుండా తగిన చర్యలు చేపట్టాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌ను ఆదేశించారు. రక్షిత తాగునీటి పథకం నుంచి సరఫరా అవుతున్న తాగునీరు కలుషితం కాకుండా వెంటనే తగిన చర్యలు చేపట్టాలని డీఈ ఏడుకొండలుకు సూచించారు. ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా సహించేది లేదని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంపై కేసు

ప్రత్తిపాడు: జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంపై ఆదివారం ప్రత్తిపాడు పోలీస్ స్టేషనులో కేసు నమోదయ్యింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం మురికిపూడికి చెందిన మక్కెన దివ్యతార, తన స్నేహితురాలైన చిలుకూరి అమల ఇద్దరూ శనివారం స్కూటీపై గుంటూరు నుంచి చిలకలూరిపేట వెళుతున్నారు. ప్రత్తిపాడు మండలం యనమదల సమీపంలో పెట్రోల్ బంకు వద్ద స్కూటీ వెనుక వస్తున్న జీపు డ్రైవర్ స్కూటీని ఓవర్‌టేక్ చేసే క్రమంలో నిర్లక్ష్యంగా, హారన్ కొట్టకుండా అతివేగంగా వచ్చి స్కూటీని ఢీకొట్టాడు. దీంతో స్కూటీపై ప్రయాణిస్తున్న దివ్య తార, అమలకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికంగా ఉన్న కాటూరి ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ దివ్యతార ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కె.నాగేంద్ర తెలిపారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటిని గెలిపించాలి

కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

ప్రత్తిపాడు: తమను గెలిపించినట్లే ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను అఖండ మెజారిటీతో గెలిపించాలని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కోరారు. వట్టిచెరుకూరులో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో పెమ్మసాని సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి ప్రణాళికలపై మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గుంటూరు కృష్ణా జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను కూటమి ప్రభుత్వం, చంద్రబాబు నాయుడు ఎంపిక చేశారని తెలిపారు. ఆయనకు మన పూర్తి సహకారం అందించాలని కోరారు. మనం ఏ విధంగా అయితే గెలిచామో, రాజేంద్రప్రసాద్‌ను కూడా అఖండ మెజారిటీతో గెలిపించే విధంగా పనిచేస్తారని ఆశిస్తున్నానన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని సూచించారు. సమావేశంలో ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు పాల్గొన్నారు.

విద్యార్థి దశలో కష్టపడాలి

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థి దశలో సుఖాలను వదులుకుంటే భవిత బంగారుమయం అవుతుందని జిల్లా యువజన సర్వీసుల శాఖ మేనేజర్ బి.రాధిక పేర్కొన్నారు. మానవత స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో జాతీయ ప్రతిభా ఉపకార వేతన పరీక్ష (ఎన్‌ఎంఎంఎస్)కు విద్యార్థులను సన్నద్ధం కోసం నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ఆదివారం సందర్శించారు. చంద్రమౌళీనగర్‌లోని భాష్యం మెయిన్ క్యాంపస్‌లో 300 మంది విద్యార్థులకు ఇస్తున్న శిక్షణ కార్యక్రమంలో రాధిక మాట్లాడుతూ సమయం అందరికీ ఒకే విధంగా ఉంటుందని, దానిని ప్రణాళికాబద్ధంగా సద్వినియోగం చేసుకున్నప్పుడే విజయాన్ని అందుకోగలమని పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి ఈఐ కేంద్రాలు క్లోజ్

- సీహెచ్‌సీల్లోని 'సీఎం ఈఐ' కేంద్రాల సేవలకు మంగళం పాడిన కూటమి ప్రభుత్వం
- గత నెల 4వ తేదీతో అపోలోతో ప్రభుత్వ ఒప్పందం పూర్తి
- 16వ తేదీ నుంచి పూర్తిగా మూతబడ్డ కేంద్రాలు
- నేత్ర సమస్యలతో బాధపడుతున్న పేద ప్రజలపై ప్రభావం

ప్రత్తిపాడు: ముఖ్యమంత్రి ఈఐ కేంద్రాలకు కూటమి ప్రభుత్వం చరమగీతం పాడింది. 2018 నుంచి ఎన్నికలకు ముందు వరకు సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో నిర్విరామంగా సాగిన ఈఐ కేంద్రాలు ఇప్పుడు మూతబడ్డాయి. ఈ కేంద్రాల్లో ప్రతి రోజూ సగటున యాభై నుంచి వంద మంది రోగులకు నేత్ర పరీక్షలు చేసేవారు. అధునాతన ఆటోరిఫ్రాక్టర్‌లు, ఫండస్ కెమెరాలతో పరీక్షలు జరిపి, సమస్య తీవ్రతను బట్టి కళ్లజోళ్లను ఉచితంగా అందజేసేవారు.

ఇప్పటి వరకు ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పది కేంద్రాల ద్వారా సుమారుగా 3,71,816 లక్షల మంది వైద్య సేవలు పొందారు. రాష్ట్ర ప్రభుత్వానికి, అపోలో ఆస్పత్రికి మధ్య ఒప్పంద కాలం సెప్టెంబర్ 4వ తేదీతో ముగిసింది. దీంతో అప్పటివరకు చేసిన పరీక్షలకు సంబంధించిన కళ్ళజోళ్ళు 16వ తేదీ వరకు పంపిణీ చేసి కేంద్రాలను మూసి వేశారు. వయస్సుతో సంబంధం లేకుండా అన్ని వర్గాల వారు ఈ కేంద్రాల ద్వారా నేత్ర పరీక్షలు చేయించుకుని దృష్టిలోపాలను సరిచేసుకున్నారు.

ప్రైవేటుకు వెళ్లాలంటే భారం..

కంటి పరీక్షలకు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లాలంటే అది గ్రామీణ ప్రజలకు శక్తికి మించిన భారమే అవుతుంది. ఓ మోస్తరు కంటి ఆస్పత్రిలో ఓపీ రూ.200 నుంచి ఆస్పత్రిని స్థాయిని బట్టి రూ.500 వరకూ ఓపీ ఫీజు ఉంటుంది. ఇవి కాక సమస్య ఉంటే కళ్లద్దాలు రూ.2 వేల నుంచి రకాన్ని నాణ్యతను బట్టి రూ.10 వేల వరకు ఉంటుంది. దీంతో కంటి చూపు సమస్యలకు అంత మొత్తంలో ఖర్చులు భరించడం సామాన్య, మధ్య తరగతి ప్రజలకు భారంగా మారింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం మళ్లీ ముఖ్యమంత్రి ఈఐ కేంద్రాలను పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.



ముఖ్యమంత్రి ఈఐ కేంద్రం లోగో



ప్రత్తిపాడు సీహెచ్‌సీలో మూతబడిన సీఎం ఈఐ కేంద్రం



ప్రత్తిపాడు సీహెచ్‌సీలో ముఖ్యమంత్రి ఈఐ కేంద్రం ద్వారా చేస్తున్న నేత్ర పరీక్షలు (ఫైల్)

ఆయా సీహెచ్‌సీలోని సీఎం ఈఐ కేంద్రాల ద్వారా నేత్ర వైద్య సేవలు పొందిన వారి వివరాలు..

సీహెచ్‌సీ	వైద్యసేవలు పొందినవారు
అమరావతి	37,926
చిలకలూరిపేట	44,120
గురజాల	33,450
మాచర్ల	32,140
పొన్నూరు	47,324
ప్రత్తిపాడు	33,854
రేపల్లె	28,024
సత్తెనపల్లి	49,587
వేమూరు	26,424
వినుకొండ	37,645
మొత్తం	3,70,494

కళ్ల జోళ్ల పంపిణీ

దగ్గర దృష్టి లోపం ఉన్న వారికి	72,211
దూర దృష్టి లోపం ఉన్నవారికి	2,31,381
మొత్తం	3,03,499

సెప్టెంబరు 16 నుంచి క్లోజ్ చేశాం

గత నెల 4వ తేదీనే ప్రభుత్వంతో అపోలోకు ఉన్న ఒప్పందం ముగిసింది. అయినప్పటికీ నాలుగో తేదీ వరకు పరీక్షలు చేసిన వారికి 16 వరకు కళ్లజోళ్లు అందించి, కేంద్రాలను క్లోజ్ చేశాం.

-టి.గోపి, జిల్లా కోఆర్డినేటర్

ఉద్యోగులు బాధ్యతగా పనిచేయాలి

కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

కాకుమాను: గ్రామ స్థాయిలో పని చేసే ప్రతి ఉద్యోగి బాధ్యతగా పని చేయాలని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఆదివారం పార్టీ నాయకుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం స్థానిక శాసన సభ్యులు బూర్ల రామాంజనేయులు ఆధ్యక్షతన నిర్వహించారు. పెమ్మసాని మాట్లాడుతూ గ్రామంలోని గ్రామ వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్, అంగన్‌వాడీ కార్యకర్త, యానిమేటర్ అందరు పంచభూతాలని వీరందరు మనస్సుతో పని చేయాలని కోరారు. గత ప్రభుత్వంలో మాదిరిగా పని చేస్తే మా ప్రభుత్వం ఊరుకోదని హెచ్చరించారు. నియోజకవర్గంలో పలు శాఖల అధికారులకు ఇంకా వైఎస్సార్ సీపీ వాసన నుంచి బయటకు రాలేదని ఇకనైనా ఆయా శాఖల అధికారులు తమ తీరును మార్చుకుని పని చేయాలని కోరారు. మా పార్టీకు చెందిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులను ఇబ్బంది పెడితే ఉపేక్షించేది లేదని అటువంటి వారిపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గత ప్రభుత్వంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమంగా పెట్టిన కేసులను తొలిగించేందుకు ప్రత్యేక న్యాయవాదులను నియమించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జనసేన జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు ఉగ్గిరాల సీతారామయ్య, నందనాదేవి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

విజ్ఞాన్ లారాలో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు



విజ్ఞాన్ లారా కళాశాలలో ఫ్లాష్ మాబ్‌లో విద్యార్థులు



మాట్లాడుతున్న రిజిస్ట్రార్ ఎంఎస్ రఘునాథన్

చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ లారా ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం ఫ్రెషర్స్‌డే వేడుకలు ఘనంగా జరిగాయి. రిజిస్ట్రార్ ఎంఎస్ రఘునాథన్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా ముందంజలో ఉండాలన్నారు. విద్యార్థులందరూ జీవితంలోని ప్రతి క్షణాన్ని బాధ్యతతో ఆనందించాలన్నారు. ప్రిన్సిపాల్ ఫణీంద్ర కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు నైపుణ్యంతో పాటు పరిశోధనాత్మక ఆలోచనలు కలిగిన విద్యా విధానం ఉండాలని తెలిపారు. వివిధ అంశాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన ఫ్లాష్‌మాబ్, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

దుర్గమ్మా.. కరుణించమ్మా




ప్రత్తిపాడు దండేశ్వరాలయంలో రాజ రాజేశ్వరి దేవి అవతారంలో అమ్మవారు



వేణుగోపాలస్వామి ఆలయంలో మంగళగౌరి అలంకరణలో దర్శనం..



మంచాలలో అన్నపూర్ణాదేవి అలంకారంలో ఆదిలక్ష్మి కామేశ్వరి



కొండపాటూరు పోలేరమ్మ అమ్మవారు లలితా త్రిపుర సుందరీ దేవిగా దర్శనం



శలపాడు శాకంబరీ అలంకారంలో దర్శనమిస్తున్న కనకదుర్గమ్మ



పొన్నూరు తోటమ్మతల్లి ఆలయ ప్రాంగణంలో అలంకరణలో అమ్మవారు

వ్యక్తిపై బ్లేడుతో దాడి



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మోహన్

ప్రత్తిపాడు: మెడికల్ షాపునకు వెళుతున్న ఒక వ్యక్తిపై ఇద్దరు బ్లేడ్‌తో గాయపరిచిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం వంగపురానికి చెందిన ఆరుమళ్ళ మోహన్ శనివారం అర్ధరాత్రి తన భార్యకు మందులు తీసుకురావడానికి గ్రామంలోని మెడికల్ షాపునకు వెళుతున్నాడు. అదే సమయంలో స్థానిక మర్రిచెట్టు సెంటర్ వద్ద ఉన్న కొండేపాటి ఏసుబాబు, కారుమూరి బాలస్వామి అడ్డగించారు. అసభ్య పదజాలంతో దూషిస్తూ ఈమధ్య ఎక్కువ చేస్తున్నావంటూ గొడవ పెట్టుకున్నారు. నిన్ను ఇక్కడికిక్కడే చంపుతామని మోహన్‌ను బెదిరించారు. దీంతో మాటామాటా పెరిగి బాలస్వామి, మోహన్‌ను వెనుక నుండి గట్టిగా పట్టుకోగా ఏసుబాబు బ్లేడుతో మోహన్ గొంతు కోసేందుకు ప్రయత్నం చేశాడు. గమనించిన మోహన్ ప్రతిఘటించి పక్కకు తప్పుకున్నా గొంతు కింద తెగి తీవ్ర రక్త గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు, కుటుంబ సభ్యులు మోహన్‌ను 108లో గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం ఆదివారం ఉదయం మోహన్ ప్రత్తిపాడు స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయడంతో ఎస్‌ఐ కె.నాగేంద్ర కేసు నమోదు చేశారు.

సేవా గుణం వాసవీమాత వరం

గుంటూరు ఎడ్యుకేషన్: శ్రీవాసవీ మాత పేరుతో సేవా కార్యక్రమాలు చేపట్టడం వరంగా భావిస్తున్నట్లు శ్రీ వాసవి సేవా సమితి అధ్యక్షుడు ఆతుకూరి సుబ్బారావు పేర్కొన్నారు. కొత్తపేటలోని ఫ్యాన్సీ మర్చంట్ కళ్యాణ మండపంలో శ్రీ వాసవి సేవా సమితి ఆధ్వర్యంలో 600 మంది పేద విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలు, 50 మంది విద్యార్థులకు రూ.వెయ్యి చొప్పున ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ 32 ఏళ్ల క్రితం వ్యవస్థాపక అధ్యక్షుడు కోట సత్యనారాయణ, గౌరవ అధ్యక్షుడు కోట వెంకటేశ్వర్లు స్థాపించిన శ్రీ వాసవి సేవా సమితి విద్య, సమాజ హిత కార్యక్రమాల ద్వారా రూ.లక్ష పేద మధ్యతరగతి ప్రజలకు అందించటం వాసవి మాత కటాక్షంగా భావిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సేవా సమితి ఉపాధ్యక్షులు కొత్తూరు వెంకట నరసింహారావు, చౌట ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

కాసుల శాఖకు తప్పని కష్టాలు

- శిథిల భవనంలోనే సిబ్బంది విధులు
- అద్దె చెల్లిస్తున్నా.. కరువైన కనీస సౌకర్యాలు
- మరమ్మతులకు కూడా నోచుకోని పొన్నూరు ఎక్సైజ్ కార్యాలయం



పొన్నూరు ఎక్సైజ్, ప్రొహిబిషన్ కార్యాలయం



పెచ్చులూడి ప్రమాదకరంగా ఉన్న కార్యాలయం లోపలి భాగం

పొన్నూరు: పొన్నూరులో ప్రభుత్వ భవనాలకు ఆదరణ కరువైంది. మున్సిపాలిటీకి ఆదాయం సమకూర్చే పలు దుకాణ సముదాయాలు, ప్రభుత్వ కార్యాలయ భవనాలు శిథిలావస్థకు చేరాయి. రెవెన్యూ, ఇంజినీరింగ్ విభాగం నిర్లక్ష్యం కారణంగా అవి కనీస మరమ్మతులకు కూడా నోచుకోవడం లేదు. దీంతో అధికారులు ఇబ్బందులు పడుతున్నారు.

ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వానికి కాసులు కురిపించే ఎక్సైజ్, ప్రొహిబిషన్ శాఖ పొన్నూరులో కష్టాలను ఎదుర్కొంటుంది. మున్సిపాలిటీ పరిధిలోని అంబేడ్కర్ నగర్‌లో ఉన్న కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరడంతో సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. దశాబ్దాల క్రితం నిర్మించిన భవనం లోపలి భాగం స్లాబ్ పెచ్చులూడుతూ ప్రమాదకరంగా మారింది. దీంతో విధులు నిర్వహించే ఎక్సైజ్ శాఖ సిబ్బంది భయాందోళనకు గురవుతున్నారు. కనీసం మరమ్మతులకు కూడా నోచుకోకపోవడంతో పనిచేసే సిబ్బంది అసౌకర్యానికి గురవుతున్నారు. కార్యాలయ ప్రాంగణమంతా పిచ్చి చెట్లతో నిండి అడవిని తలపిస్తోంది. ఏళ్ల తరబడి సమస్య ఉన్న సంబంధిత అధికారులు పట్టి పట్టనట్లు వ్యవహరించడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

- పురపాలక శాఖ ఆధ్వర్యంలో దశాబ్ద కాలం క్రితం అంబేడ్కర్ నగర్‌లో ఎక్సైజ్ కార్యాలయం నిర్మితమైంది. మున్సిపాలిటీకి లీజు ప్రాతిపదికన నెలకు రూ.పదివేలకు పైగా ఎక్సైజ్ శాఖ అద్దె చెల్లిస్తున్నట్లు సమాచారం. విశాలమైన ప్రదేశంలో ఏర్పాటైన భవనానికి సంబంధిత అధికారుల ఆదరణ కరువైంది. గతంలో పనిచేసిన అధికారులు భవన అభివృద్ధికి ఎలాంటి చర్యలు చేపట్టక నిర్లక్ష్యానికి గురైంది. కనీసం మరమ్మతులకు కూడా నోచుకోకపోవడంతో కార్యాలయం శిథిలావస్థకు చేరింది. కార్యాలయ ప్రాంగణమంతా పిచ్చి చెట్లతో దర్శనమిస్తోంది. ప్రస్తుతం ఎక్సైజ్ శాఖలో బదిలీలు జరగడంతో పూర్తి స్థాయిలో సిబ్బంది విధులకు హాజరై అసౌకర్యానికి గురవుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి ఎక్సైజ్ శాఖ భవనానికి మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉంది. ఈ విషయమై మున్సిపల్ ఆర్‌వో వెంకటేశ్వరరావును వివరణ కోరగా భవనం మున్సిపాలిటీ పరిధికి చెందినదని ఎక్సైజ్ కార్యాలయం కొనసాగుతుందని పేర్కొన్నారు.

'శిక్షణ' ఫలితం ఉండేనా..?

- మరో ఏడాదిన్నరలో ముగియనున్న పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం
- ఇప్పుడు ఉపసర్పంచులు, వార్డు సభ్యులకు శిక్షణ
- నేటి నుంచి ప్రారంభంకానున్న శిక్షణ కార్యక్రమాలు

ప్రత్తిపాడు: పంచాయతీ పాలక వర్గాల పదవీ కాలం మరో ఏడాదిన్నరలో ముగియనుంది. సర్పంచులు, ఉపసర్పంచులు ఎన్నికై దాదాపుగా నలభై నెలలు గడిచిపోయింది. వార్డు సభ్యులుగా ఎన్నికై ఎన్నో సమావేశాలకు హాజరయ్యారు కూడా. మరెన్నో తీర్మానాలను ఆమోదించారు. కానీ ఇప్పుడు కూటమి ప్రభుత్వం పంచాయతీరాజ్ సంస్థల ప్రజాప్రతినిధులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఆగస్టులో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ పూర్తి చేశారు. తాజాగా రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్, పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ కమిషన్ ఆదేశాల మేరకు ట్రెనింగ్ క్యాలెండర్ ప్రకారం అక్టోబరు 7 నుంచి 10వ తేదీ వరకు మండలాల్లో ఉపసర్పంచులు, వార్డుసభ్యులు(ఒక్కో పంచాయతీకి ఇద్దరు చొప్పున)కు రెండు రోజుల పాటు శిక్షణ కార్యక్రమాలను నిర్వహించనున్నారు.



ప్రత్తిపాడు గ్రామ పంచాయతీ కార్యాలయం

శిక్షణలో..

- పంచాయతీ సాధారణ, కనీస పరిపాలనా విధానం
- ఏపీ పంచాయతీరాజ్ చట్టం ముఖ్య నిబంధనలు 1994
- పారిశుద్ధ్యం, వ్యర్థాల నిర్వహణ
- ఆస్తులు, తాగునీటి నిర్వహణ
- లేఅవుట్ అండ్ బిల్డింగ్ ప్లాన్ నిబంధనలు
- వీధిదీపాలు, విద్యుత్ బిల్లుల నిర్వహణ
- ఆర్థిక నిర్వహణ
- కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సామాజిక సంక్షేమ పథకాలు

నియోజకవర్గంలో ఇలా..

ప్రత్తిపాడు నియోజకవర్గంలో ప్రత్తిపాడు, పెదనందిపాడు, గుంటూరురూరల్, వట్టిచెరుకూరు, కాకుమాను మండలాల పరిధిలో మొత్తం 79 గ్రామ పంచాయతీలున్నాయి. ఆయా పంచాయతీల సర్పంచులతో పాటు ఒక్కో పంచాయతీ నుంచి ఇద్దరు వార్డు సభ్యులు చొప్పున మొత్తం 158 మంది వార్డు సభ్యులు నేటి నుంచి శిక్షణ కార్యక్రమంలో పాల్గొననున్నారు. వీరికి మండల స్థాయిలో కోర్సు డైరెక్టర్‌గా ఎంపీడీఓ, అసిస్టెంట్ కోర్స్ డైరెక్టర్‌గా ఈఓపీఆర్డీ వ్యవహరించనున్నారు.

ఉపసర్పంచి, వార్డుసభ్యులు హాజరవ్వాలి



ప్రత్తిపాడు మండల పరిషత్ కార్యాలయంలో ఉపసర్పంచ్‌లు, ఒక్కో పంచాయతీకి ఇద్దరు వార్డు సభ్యులకు శిక్షణ ఇస్తున్నాం. ఆయా గ్రామాల ఉపసర్పంచులు, నిర్దేశించిన వార్డు సభ్యులు తప్పనిసరిగా శిక్షణకు హాజరు కావాలి. గ్రామ పంచాయతీ పరిపాలన, పంచాయతీరాజ్ చట్టం.. నిధులు, విధులు వంటి వాటిపై సమగ్ర అవగాహన కల్పిస్తాం.

-కె.శివపార్వతి, ఎంపీడీఓ, ప్రత్తిపాడు

ఆయుర్వేదంతో సంపూర్ణ ఆరోగ్యం

డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు



గుంటూరు రూరల్: నగర శివారుల్లోని గోరంట్ల ఇన్నర్ రింగ్ రోడ్డు సమీపంలోని శ్రీ వేంకటేశ్వర ఆయుర్వేదిక్ హాస్పిటల్‌లో ఆదివారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. ఆస్పత్రి చీఫ్ డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆయుర్వేద వైద్యం ఎంతో పురాతనమైందని అమ్మవంటిదని తెలిపారు. దీని వల్ల ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా సంపూర్ణంగా మూలాలతో సహా వ్యాధులు నయం చేస్తుందన్నారు. తెలుగు రాష్ట్రాల్లో అతి పెద్దదైన 120 పడకలతో ఆయుర్వేద వైద్యశాలను గుంటూరు నగరంలో ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని కోరారు. ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరంలో నాడీ పరీక్షలు చేసి 120 మందికి రూ.90 వేల విలువ చేసే మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ కశ్యప్, డాక్టర్ రాహుల్, డాక్టర్ ప్రణవి, డాక్టర్ ఐశ్వర్య, మల్లేశ్వరి పాల్గొన్నారు.